క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విజయనగరం టౌన్: పద్మభూషణ్ చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రమణస్వామినాయుడు ఆధ్వర్యంలో జిల్లా మెగా ఫ్యామిలీ అధ్యక్షుడు రాంకీ నేత్రత్వంలో శుక్రవారం స్వామి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నగర మేయర్ విజయలక్ష్మి, జనసేన నాయకులు గురాన అయ్యలు వైద్యశిబిరాన్ని సందర్శించారు. సిటీ బస్టాండ్ వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మెగాభిమానులు నానాజీ, రంగనాయకులు, మునిబాలుడు, శ్రీను, రాము, వేణు, రాంబాబు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

డెంకాడ: గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, మండపాలు ఏర్పాటుకు పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు అన్నారు. ఉత్సవ విగ్రహాలను రోడ్డుకు అంతరాయం లేకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ సభ్యులు ఆధార్, చిరునామాలు, పూజా వివరాలు ఇవ్వాలన్నారు. ఎక్కువ శబ్దం వచ్చే స్పీకర్లను ఉపయోగించరాదని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే స్పీకర్లు వినియోగించాలని తెలిపారు. వినాయక మండపం ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకూ చాలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

ఉపాధి కోర్సులలో మహిళలకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువతులకు ఉపాధి కలిగించే పలు కోర్సులకు ఉచిత శిక్షణా తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ వసతిగృహంలో నిర్వహిస్తామని సంస్థ అధికారి డి.భాస్కరరావు శుక్రవారం తెలిపారు. మహిళలకు ఉమెన్స్ టైలరింగ్, మగ్గం వర్క్ అండ్ పెయింటింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో వసతి, భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు తెల్లకార్డుదారులు, 45 ఏళ్ల లోపున్న గ్రామీణ ప్రాంత మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల సెప్టెంబర్ 5వ తేదీ లోపు దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9959521662, 9985787820 నంబర్లను సంప్రదించాలని సూచించారు.


పారిశుద్ధ్య పనుల పరిశీలన



గుడివాడ గ్రామంలోని వీధి కాలువను పరిశీలిస్తున్న డీపీవో

భోగాపురం: మండలంలోని గుడివాడ గ్రామంలో పారిశుద్ధ్య పనులతో పాటు వీధి కాలువలను డీపీవో డి మల్లికార్జునరావు శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రతిరోజు క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించాలన్నారు. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేసి గ్రామస్తులకు కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీలో కార్యదర్శులు స్వమిత్ర సర్వేని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో గాయత్రి మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా పరిశీలన



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్

విజయనగరం: త్వరలో జరగనున్న 34వ డివిజన్ ఉప ఎన్నికకు సంబంధించి క్షేత్ర స్థాయిలో ఓటరు జాబితా పరిశీలించే కార్యక్రమాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 34 వ డివిజన్ సంబంధించి జరగనున్న ఉప ఎన్నికకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తమైన తాజా ఓటరు జాబితాను ప్రకటించే నిమిత్తం ముందస్తు చర్యలలో భాగంగా డివిజన్‌లో ప్రతి ఓటరు యొక్క వివరాలను తెలుసుకొని ఓటరు జాబితా ప్రకారం ఓటర్లు ఉన్నారా.. లేదా.. అన్న విషయాన్ని తనిఖీ చేయాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి డివిజన్ స్థాయిలో ఓటరు జాబితా ప్రకారం వివరాలను నిర్ధారించుకొని, తుది నివేదిక సమర్పించాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టీపీవో అప్పలరాజు, టీపీఎస్ అనిత, ప్లానింగ్ సెక్రటరీలు, బూత్ లెవెల్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ పూజలు

శ్రావణ శుక్రవారం విజయనగరంలోని చదురుగుడిలో పైడితల్లి శాకంబరిగా దర్శనమివ్వగా, రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో మహాలక్ష్మీదేవిగా భక్తులను ఆశీర్వదించారు. పాతబస్టాండ్ వద్దనున్న కనకమహాలక్ష్మి అమ్మవారిని చీరలతో, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారు బంగారు చీర, వజ్రకిరీట ధారణలో, బొండాడ వీధిలో ఉన్న కామాక్షి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో లక్ష్మీదేవికి సామూహిక కుంకుమార్చన జరిపారు. రాజీవ్‌నగర్ కాలనీలో పైడితల్లి అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. మయూరి కూడలిలో ఉన్న సంతోషిమాత ఆలయంలో 1100 కిలోల పసుపు కొమ్ములతో సహస్ర నామార్చన జరిపారు.

– విజయనగరం టౌన్




మహాలక్ష్మీ అమ్మవారికి సహస్ర దీపాలంకరణ



మహాలక్ష్మీ దేవీ అలంకరణలో వనంగుడి పైడితల్లి అమ్మవారు



చీరల అలంకరణలో కనకమహాలక్ష్మీ అమ్మవారు



బంగారు చీర, వజ్రకిరీటం అలంకరణలో కన్యకపరమేశ్వరీ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో బొండాడవీధిలో కొలువైన కామాక్షి అమ్మవారు



పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో లక్ష్మీదేవి పూజలు

● లక్ష యూనిట్ల రక్త సేకరణే లక్ష్యం



దేశవ్యాప్తంగా అన్ని బ్రహ్మకుమారీల కేంద్రాల్లో లక్ష యూనిట్లు సేకరించే లక్ష్యంతో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జి బికె.అన్నపూర్ణ పేర్కొన్నారు. విశ్వబంధుత్వ దినోత్సవం పురస్కరించుకుని విజయనగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరాన్ని విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. 86 మంది విద్యార్థులు, పెద్దలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కెఆర్‌డి.ప్రసాద్, జేఎన్‌టీయూ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సరస్వతి, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్

కార్మిక పక్ష నేత బుగత

విజయనగరం గంటస్తంభం: కార్మిక పక్ష నేత కామ్రేడ్ బుగత సూరిబాబు అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐటీడీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. సూరిబాబు ఐదో వర్ధంతి స్థానిక డీఎస్ఆర్ అమర్ భవన్‌లో శుక్రవారం జరిగింది. ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సూరిబాబు సమరశీల పోరాటాలను కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు అంతా పాటు పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమణమ్మ, అప్పలరాజు, జగన్నాధం, వాసు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'ఏటీఎల్ మెంటర్‌షిప్' ల్యాబ్ పరిశీలన



ఏటీఎల్ మెంటర్‌షిప్ ల్యాబ్ పరిశీలన బృందంతో విద్యార్థులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల 'ఏ టీ ఎల్ మెంటర్‌షిప్' ల్యాబ్‌ల పరిశీలన శుక్రవారం కొనసాగింది. జిల్లాలోని జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామతీర్థం జిల్లా పరిషత్ పాఠశాలలను బృందాలు వేర్వేరుగా సందర్శించాయి. స్కూళ్లలో ఏ టీ ఎల్ ల్యాబ్‌లో నిర్వహిస్తున్న సైన్స్ పరిజ్ఞాన విధానాలను బృందం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది.

కార్యక్రమంలో విజ్ఞానాశ్రమం పూణే మేనేజర్ కిషోర్ గైక్వాడ్, జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్, ఏటీఎల్ రాష్ట్ర పరిశీలకులు వెంకటేష్, రమేష్, ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి ల్యాబ్‌లను పరిశీలించారు. డాక్టర్ జీజే నాగరాజు, సంతోష్‌కుమార్, మనోహర్ సాహూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జామి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు జాకబ్, ఉపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వరరావు, లలిత, రామతీర్థం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నగేష్, బీ.శ్రీనివాసరావు, కుమారస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

'భావితరాలకు జానపద కళలను అందించలేకపోతున్నాం'



కోట జంక్షన్ నుంచి ర్యాలీగా వెళ్తున్న జానపద కళాకారులు

విజయనగరం టౌన్: ఒకప్పుడు ప్రజలకు విజ్ఞానం, వినోదం అందించిన జానపద కళలు నేడు అంతరించిపోతున్నాయని, జానపద కళాకారులకు ఉపాధి లేక భావితరాలకు ఈ కళలను అందించలేకపోతున్నామని గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ జానపద దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కోట జంక్షన్ నుంచి కళాకారులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కోట జంక్షన్, గంటస్తంభం మీదుగా పాతబస్టాండ్ వరకూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళల పరిరక్షణకు 20 ఏళ్లుగా కళాపీఠం సేవలందిస్తోందన్నారు. అనేక మంది కళాకారులను వెలుగులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రజానాట్య మండలి ప్రతినిధి షణ్ముఖరావు మాట్లాడుతూ కళాకారులకు 50ఏళ్లకే పెన్షన్ సదుపాయం కల్పించాలని, బస్సు పాసులు ఇప్పించాలని, కళాకారులకు ఇళ్లు, ఆరోగ్యశ్రీకార్డులు వచ్చేలా చూడాలని, శిక్షణా కేంద్రాలను ఏర్పాటుచేసి వారికి శిక్షణనిచ్చి భావితరాలకు కళలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా లక్కిడాం సన్యాసమ్మ జముకుల పాట, గంట్యాడ మండలం గొల్లయ్య బృందం గంగిరెద్దులాట, మన్యం జిల్లా సీతానగరం మండలం సోముల బృందం తప్పెటగుళ్లు, నెల్లిమర్ల మండలం మారినాయుడు చెక్కభజన, విజయనగరం సాయి గురు మహిళా మహిళా కోలాటం, ఇచ్ఛాపురం మండలం బి.లోకనాథం బుర్రకథ, కవిటి మండలం ప్రకాశ బృందం పగటి వేషాలు, ఎలమంచిలి చింతాడ నాగేశ్వరరావు, ఫకీర్ వేషంతో ఊరేగింపులో పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో షేక్ గౌస్ భాషా, చీకటి దివాకర్, ధవళ సర్వేశ్వరరావు, చీకటి చంద్రికారాణి, విజయలక్ష్మి, ఫణిశ్రీ కళాకారులు పైడిరాజు, హేమ, శోధన, సుధాకర్, సంగీత్ కుమార్, రాపాక సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమంపై విషం చిమ్మడం సరికాదు

● మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ : నిరుపేదలైన, ఎటువంటి ఆదరణలేని దివ్యాంగ కుటుంబాలు సంక్షేమంపై సర్కారు విషం చిమ్మడం సరికాదని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గం సమన్వయకర్త బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏళ్ల నుంచి అంగవైకల్యంగా వైద్యులు నిర్ధారించిన సర్టిఫికెట్ ఆధారంగా పెన్షన్ పొందుతున్న దివ్యాంగులపై నిబంధనలను కఠినతరం చేసి పింఛన్ నిలిపివేయడానికి ప్రయత్నించడం దుర్మార్గం అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 1200 మంది దివ్యాంగులకు నిబంధనల పేరిట పింఛన్‌లు తీయించడానికి నోటీసులు జారీ చేయడం దుర్మార్గం అయిన చర్య అన్నారు. రీసర్వే పేరుతో వైద్యులతో తప్పుడు పరిశీలనలు చేయించి 40 శాతం కంటే తక్కువ వైకల్యం వుందంటూ నోటీసులు జారీచేయడం తగదన్నారు. అర్హులైన దివ్యాంగులకు సదరంలో ఇన్ ఎలిజిబుల్‌గా సర్టిఫికెట్ జారీ చేశారని ధ్వజమెత్తారు. తక్షణమే పునరాలోచన చేసి దివ్యాంగులకు పింఛన్‌లు పునరుద్ధరించి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజను ప్రారంభమై వరిసాగులో రైతులు బిజీగా వున్న తరుణంలో యూరియా కొరత వేధిస్తోందన్నారు. రైతులకు సరిపడా ఎరువులు దొరక్కపోవడంతో రైతన్నలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. రైతులు, దివ్యాంగుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

డిగ్రీ ప్రవేశాల్లో విద్యార్థులకు అన్యాయం

విజయనగరం గంటస్తంభం: డిగ్రీ ప్రవేశాల విషయంలో గందరగోళం వలన విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి డి.రాము, సిహెచ్.వెంకటేష్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం ఇప్పటికే డిగ్రీ అడ్మిషన్ల విషయంలో చాలా ఆలస్యం చేయడం వలన విద్యార్థులు నెలల తరబడి చదువుకు దూరమయ్యారన్నారు. తీరా అడ్మిషన్లు ప్రారంభమైనప్పటికీ సాంకేతిక లోపాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నెల 20వ తేదీన ప్రారంభమైన అడ్మిషన్లు గత మూడు రోజులుగా అనేక సమస్యల్ని ఎదుర్కొంటూ సర్వర్ సమస్యతో ఇబ్బంది పడినప్పటికీ చాలామంది విద్యార్థులు ఎంట్రన్స్ ఫీజులు కట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. అకస్మాత్తుగా 22వ తేదీ వచ్చేసరికి అప్పటి వరకు ఆన్‌లైన్‌లో జరిగినటువంటి అడ్మిషన్లు అన్నింటిని రద్దు చేయడం సరికాదన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



భోగాపురం: తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

భోగాపురం: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న బీసీ హాస్టల్ శిథిలావస్థకు చేరుకుని రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు సొంత భవనం నిర్మించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. సొంత భవనం లేకపోవడంతో గత సంవత్సరం కంటే 50 మంది విద్యార్థులు తగ్గారని, ప్రస్తుతానికి 20 మంది విద్యార్థులు మాత్రమే హాస్టల్‌లో ఉంటున్నారన్నారు. ఇది కూటమి ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న జరగబోయే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్, కమిటీ సభ్యులు రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడలో..

డెంకాడ: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీన చలో కలెక్టరేట్ కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు, దీనిని విద్యార్థులు విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ రాజారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రమేష్,రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలి

నెల్లిమర్ల రూరల్: అటవీ శాఖ అధికారులపై దాడి చేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌ను సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

విధి నిర్వహణలో ఉన్న దళిత వర్గాలకు చెందిన అటవీ శాఖ అధికారులపై దాడి చేయడం ఎమ్మెల్యేకు తగదన్నారు. ఏ అధికారంతో దాడి చేశారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత ప్రజలపై కూటమి నేతలకు దాడులకు తెగబడడం బాధాకరమన్నారు. తక్షణమే ఎమ్మెల్యేపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పార్టీ నుంచి సస్పెండ్ చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.

కూటమి పాలనలో దళితులపై పెరిగిన దాడులు



మాట్లాడుతున్న జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

నెల్లిమర్ల రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో దళితవర్గాలపై దాడులు, దౌర్జన్యాలు, మాన భంగాలు తీవ్ర స్థాయిలో పెరిగిపోయాయని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య అన్నారు. నెల్లిమర్లలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు నమ్మి గెలిపించిన నాయకులే భక్షకులై ప్రజలపై దాడులు చేసి, చేయించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీశైలంలో అధికార పార్టీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ దళిత ఆదివాసీ అధికారులపై దాడి చేయడం అమానుషమైన చర్య అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అవుతున్నా దళితుల పరిస్థితి ఇంకా దయనీయంగానే ఉందని, రాష్ట్ర నలుమూలల ఏదో చోట నిత్యం దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కు కల్పించినప్పటికీ దళితులు, ఆదివాసీలకు అందని ద్రాక్షలా మారిందన్నారు. దళితులపై దాడులకు పాల్పడుతున్న సంబంధిత ఎమ్మెల్యేలు, నాయకులను పార్టీ నుంచి బహిష్కరించి, అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ చిన్నం అరుణ్ కుమార్, నాయకుడు మామిడి కుమార్ రాజు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: వచ్చే నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులన్నీ పరిష్కరించనున్నామని అన్నారు. న్యాయవాదులు, పోలీసులు లోక్‌అదాలత్‌కు సహకరించి వీలైనన్ని కేసులను పరిష్కరించుకునే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజులు కూడా వాపసు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి సీహెచ్ హరిప్రియ, బార్ అసోసియేషన్ కార్యదర్శి బి.తిరుపతినాయుడు, ప్రభుత్వ న్యాయవాది పి.శ్రీనివాస్, కె.రమణమూర్తి, ఆర్.రామమూర్తినాయుడు, జె.అప్పలనాయుడు, వైఎస్ శ్రీనివాస్, ఎస్.అప్పలనాయుడు, కె.కొండలరావు, ఎస్.జయలక్ష్మి పాల్గొన్నారు.